నేతన్నలకు మంచి రోజులు


సిరిసిల్లలో చీరల ప్రాసెసింగ్



- సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు త్వరలో పనులు
- మళ్లీ చీరల ఆర్డర్లు
- స్వశక్తి సంఘాల మహిళలకు 1.30 కోట్ల చీరలు
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బకాయిలు విడుదల
- వీడనున్న వస్త్ర పరిశ్రమ సంక్షోభ భయం
- సీఎం ప్రకటనతో చిగురించిన ఆశలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వశక్తి సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున అందించడానికి నిర్ణయించినట్లు, ఇందు కోసం 1.30 కోట్ల చీరల ఆర్డర్లు ఇవ్వబోతున్నట్లు ప్రకటించడంతో సిరిసిల్ల కార్మికుల్లో మళ్లీ ఉపాధి ఆశలు చిగురించాయి. పాత బకాయిలు కూడా విడుదలవుతుండడంతో పరిశ్రమకు మంచి రోజులు వస్తున్నాయని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలతో ఉపాధి లభించింది. కొత్త ప్రభుత్వం బతుకమ్మ చీరల్లో నాణ్యతలేదని, మహిళలు వినియోగించుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయని ఉత్పత్తి ఆర్డర్లను నిలిపివేసింది.

దీంతోపాటు గత ప్రభుత్వ హయాంలోని రూ.275 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోవడంతో పరిశ్రమ ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. పస్తులతో నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్న విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. సమృద్ధిగా ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో పూర్తి స్థాయిలో మగ్గాలు నడవక తల్లాడిల్లిపోతున్న నేపథ్యంలో కార్మిక సంఘాలు, పవర్‌లూం వస్త్రోత్పత్తి దారుల అనుబంధ సంఘాలు ఆందోళన బాట పట్టాయి. కార్మికుల ఆత్మహత్యలను నివారించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బకాయిలు చెల్లించాలని ఆందోళనలు కొనసాగాయి. ఈ క్రమంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునే దిశగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బతుకమ్మ చీరలు, ఇతర బకాయిలను కొంతమేరకు ప్రభుత్వం విడుదల చేసింది. విద్యార్థుల యూనిఫాం క్లాత్ ఉత్పత్తులతో మళ్లీ మగ్గం చప్పుళ్లు మొదలయ్యాయి.

నేతన్నకు బీమాతో భరోసా

నేత కార్మికులకు బీమా భరోసాను కల్పిస్తూ పథకాన్ని ప్రభుత్వం అందించింది. కార్మికులు సాధారణ, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల బీమాను అందించడానికి ప్రీమియం చెల్లించింది. ఈ పథకంలో 4806 మంది కార్మికులు చేరారు. బతుకమ్మ చీరల ఉత్పత్తిలో కార్మికులకు నూలు రాయితీని విడుదల చేసింది.

మిగిలింది విద్యుత్ సమస్య

సిరిసిల్ల నేత కార్మికులకు ప్రభుత్వ నిర్ణయంతో బతుకు భయం వీడనున్నా వస్త్ర పరిశ్రమను విద్యుత్ సమస్య వెంటాడుతూనే ఉంది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు వస్తున్నా విద్యుత్ రాయితీ సమస్య కొలిక్కి రావడం లేదు. విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు పలుమార్లు సమావేశమైనా శాశ్వత పరిష్కారం లభించలేదు. విద్యుత్ భారంతో మరమగ్గాల కార్ఖానాల్లో సాంచెలను అమ్ముకున్న పరిస్థితులు ఉన్నాయి. వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించే దశ లో విద్యుత్ సమస్య ప్రధానంగా మారింది.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వస్త్రోత్పత్తిదారుల ఐక్య కార్యాచరణ ద్వారా ఆందోళనలు చేపట్టారు. సమస్య పరిష్కరిస్తామని ప్రభుత్వ పెద్దలు, అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనలు ముగిసినా ఇంకా పరి ష్కారం కాలేదు. సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమల కు అందిస్తున్న విద్యుత్ సబ్సిడీని 10 హెచ్‌పీల పైనా ఉపయోగిస్తున్న వారికి యూనిట్ ధర పెంచడంతో విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక కార్ఖానాలు మూత పడ్డాయి. ఆత్మహత్యలు, ఆకలిచావుల నేపథ్యం లో 2001లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 50 శాతం విద్యుత్ రాయితీ ని ప్రకటించారు. అప్పటి నుంచి రాయితీ కొనసాగు తోంది. కేటగిరీ నాలుగు కింద యూనిట్ విద్యుత్ రూ.4 ఉండగా ఇందులో ప్రభుత్వం 50 శాతం భరి స్తుంది. ప్రభుత్వం మారినా విద్యుత్ సబ్సిడీ మాత్రం కొనసాగింది. 10 హెచ్‌పీలు విద్యుత్ వినియోగించు కునే విధంగా నిబంధన ఉంది. పది హెచ్‌పీలో పది మరమగ్గాలు మాత్రమే నడిపించే వీలు ఉంటుంది. పది హెచ్‌పీలపైనా వినియోగించే మరమగ్గాల కార్ఖా నాలకు ప్రతీ యూనిట్‌కు రూ.7.80 చెల్లించాల్సి ఉంటుంది.

ఇది భారంగా మారడంతో పెద్ద కార్ఖానాల యజమానులు మరమగ్గాలను తగ్గించుకోవాలనే ప్రయత్నం మొదలుపెట్టారు. లో టెక్నాలజీ మగ్గాలు కావడంతో వాటిని ఎవరూ కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో కొంత మంది తూకానికి అమ్ముకున్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ముఖ్య మంత్రికి ఇటీవల లేఖను రాశారు. సిరిసిల్లలోని పవర్‌లూం నిర్వాహకులకు పవర్‌లోడ్ సామర్థ్యం పది హెచ్‌పీల కారణంగా అవస్థలు పడుతున్నారనే తమ దృష్టికి వచ్చిందని ప్రస్తుత పరిమితిని 20 హెచ్‌పీలకు పెంచాలని ప్రతీ నెల కిలోవాట్‌కు రూ.20 నుంచి 30 రూపాయల వరకు 20 హెచ్‌పీల వకు కిలోవాట్‌కు రూ.4 నిర్ణయించాలని కోరారు. 20 హెచ్‌పీల వరకు విద్యుత్ సబ్సిడీగా పరిగణిస్తూ యూనిట్‌కు రూ.1.25 నిర్ణయించాలని కోరుతూ లేఖను కూడా రాశారు. ప్రస్తుతం విద్యుత్ సమస్య తీరితేనే పరిశ్రమ సంక్షోభం వీడనుంది.


సిరిసిల్ల మరమగ్గాలపై తయారవుతున్న చీరలు

1.30 కోట్ల చీరల ఆర్డర్లు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో 2017లో గత ప్రభుత్వం కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చింది. రూ.250 కోట్ల నుంచి ఏటా రూ.350 కోట్ల వరకు ఆర్డర్లను ఇస్తూ వచ్చింది. బతుకమ్మ చీరల ఉత్పత్తి జరిగినా నాణ్యత లేదనే విమర్శలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో బతుకమ్మ చీరల స్థానంలోనే కొత్త డిజైన్లతో నాణ్యతతో స్వశక్తి సంఘాల్లోని మహిళలకు రెండు చీరల చొప్పున అందించాలని నిర్ణయించింది.

1.30 కోట్ల చీరలను ఉత్పత్తికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో సిరిసిల్ల నేతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 30 వేల 352 మరమగ్గాలు జియో ట్యాగింగ్ లెక్క ప్రకారం ఉన్నాయి. మరో 5 వేల మగ్గాలు కూడా నడుస్తున్నాయి. బతు కమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేసిన తరువాత ప్రభుత్వం మ్యాక్స్ సొసైటీలు, ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించ డానికి స్కూల్ యూనిఫాంకు సంబంధించి 40.68 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లను ఇచ్చింది. టెక్స్‌టైల్ పార్కుకు అదనంగా 49.94 లక్షల మీటర్ల ఉత్పత్తులు అందించింది. ప్రస్తుతం ఆర్డర్లు పూర్తయిన దశలో కొత్త ఆర్డర్ల కోసం వస్త్రోత్పత్తి దారులు ఎదురూ చూశారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు అందించడానికి త్వరలోనే ఉత్పత్తి ఆర్డర్లను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. సిరిసిల్లకు రావాల్సిన బకాయిల్లో గతంలో రూ.150 కోట్లు విడుదలవగా మిగతా బకాయిలు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

8లో..

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 397మీటర్లకు 394.45 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలకు 2.80 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీరు వస్తుండగా రెండు పంపులద్వారా ఎత్తిపోస్తున్నారు. రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బాధితులకు సత్వర న్యాయం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 9: భూ తగాదాలకు చట్టప్రకారం సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో బాధితుల నుంచి 16 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామన్నారు.

15న రేషన్ డీలర్ల భర్తీకి అర్హత పరీక్ష

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల భర్తీకి ఈ నెల 15న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామచంద్రం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఖాళీగా ఉన్న 7 రేషన్ దుకాణాలకు 40 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు హాల్ టిక్కెట్ల కోసం రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కోనరావుపేట, సెప్టెంబరు 9: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మంగళపల్లిలో సోమవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, మంచి మార్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాదనేని బాలరాజు, అవురం సురేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శరత్, బాధనేని శేఖర్, సాసాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9: మహిళలు వేధింపులకు గురైతే షీటీంకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఇన్‌చార్జి ప్రమీల అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాణీనికేతన్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వవద్దని అన్నారు. ప్రిన్సిపాల్ దేవరాజం, తూముకుంట శ్రీనిధి, హెడ్‌కానిస్టేబుల్ వీరయ్య, పీసీలు ప్రియాంక, రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు


జంగమరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. జంగమరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం అదనపు తరగతి గది నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంఈవో బన్నాజీ, ప్రధానోపాధ్యాయుడు గోనే సత్యం, విద్యాకమిటీ చైర్మన్ జమున, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, ఎఫ్‌బీఐ అధ్యక్షుడు తూముకుంట రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మంద బాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో స్టడీ టేబుల్స్ వితరణ

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పల అమరేందర్ స్టడీ టేబుల్స్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా అమరేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, నాయకులు ఆనందరెడ్డి, బాలపోచయ్య, రమేష్, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేష్‌చంద్ర, బాలయ్య, రాకేష్ పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరువలేనివి : కలెక్టర్







కాళోజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు

సిరిసిల్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కాళోజీ జయంతి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ భాష సంరక్షణకు కాళోజీ కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జడ్పీ సీఈవో వినోద్, డీవైఎస్‌వో రాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో..

పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఫసత్ అలీ బేగ్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, గడ్డం లత, లింగంపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, పూల మాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ కోసం రచనలతో ప్రజలను జాగృతం చేశారన్నారు.

సిరిసిల్ల క్రైం: తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రాంతంలోని అనేకమంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనీకుడు కాళోజీ నారాయణరావు అని , తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేయాలి

- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9: జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల వారిగా 21 మంది జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ నెలలో ఒక రోజు రాత్రి బస చేయాలని, సౌకర్యాలను పరిశీలించాలించి నోడల్ అధికారి, డీఈవో రమేష్ కుమార్‌కు నివేదిక సమర్పించాలని సూచించారు.

● తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల ఇల్లంతకుంటకు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రజిత, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల నర్మాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మీ, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాలకు మానాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల నేరెళ్లకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల చిన్నబోనాలకు జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల బద్దెనపల్లికి జిల్లా పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మీ, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల వేములవాడకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గీత, తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల జూనియర్ కళాశాల దుమాలకు పరిశ్రమల శాఖ జిల్లా డైరెక్టర్ ఎంఏ భారతి, తెలంగాణ సాంఘిక బాలుర గురుకుల పాఠశాల బోయినపల్లికి చేనేత జౌళిశాఖ ఏడీ మిట్టకోల సాగర్, తెలంగాణ సాంఘిక బాలుర గురుకుల పాఠశాల ముస్తాబాద్‌కు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, తెలంగాణ సాంఘిక బాలుర గురుకుల పాఠశాల తంగళ్లపల్లికి జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, తెలంగాణ సాంఘిక బాలుర గురుకుల పాఠశాల మరిమడ్లకు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తెలంగాణ సాంఘిక బాలురగురుకుల పాఠశాల కోనరావుపేటకు మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, తెలంగాణ సాంఘిక బాలురగురుకుల పాఠశాల పెద్దూర్‌కు సహాయ కార్మిక శాఖ అధికారి నజీర్, తెలంగాణ సాంఘిక బాలురగురుకుల పాఠశాల మండెపల్లికి జిల్లా ముఖ్యప్రణాళికా అధికారి శ్రీనివాస చారి, తెలంగాణ సాంఘిక బాలుర గురుకుల పాఠశాల వేములవాడకు జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, తెలంగాణ సాంఘిక బాలురగురుకుల పాఠశాల వేములవాడకు వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తెలంగాణ సాంఘిక బాలురగురుకుల పాఠశాల ఎల్లారెడ్డిపేటకు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రాందాస్‌ను నియమించారు.

వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 9: సిరిసిల్లలో ఏర్పాటు చేసిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేసి ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. హైదరాబాద్‌లోని చేనేత భవన్‌లో సోమవారం చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం సిరిసిల్లలో నెలకొన్న సమస్యలతోపాటు వస్త్ర పరిశ్రమ సంక్షోభం, టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న పరిస్థితులను, ఉపాధి లేక కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమతోపాటు అనుబంధ రంగాల పరిశ్రమల కార్మికులు, అసాముల సంక్షేమం కోసం ఆలోచించాలని కోరారు. సిరిసిల్ల ప్రాంతంలోని నేతన్నలు సుమారు 1500 మంది కార్మికులు చేసిన సంతకాల కాగితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయాలని ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇచ్చినట్లు చెప్పారు. వర్కర్ టు ఓనర్ పథకం కార్మికులకు అందించాలన్నారు. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, నేతన్నలకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న రమణ

పోషణ లోపంతో ఒక్కరూ బాధ పడవద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9: జిల్లాలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఏ ఒక్కరూ పోషణ లోపంతో బాధపడకూడదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. పోషణ మాసంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల తీరుపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ లోపంతో బాధపడేవారికి పోషకాహారం, వైద్య సేవలు అందించాలని, అత్యవసరమైతే నేరుగా తనకు ఫోన్ చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు సూచించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవోలు, సూపర్ వైజర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. గర్భిణులు, హై రిస్క్ కేసులను గుర్తించాలని, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా పౌష్టికాహారంతోపాటు, మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధి కారి లక్ష్మీరాజం, సీడీపీఓలు సౌందర్య, సబిత, ఏసీడీపీవోలు సుచరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరువలో ఉన్నాయి. ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు పరిస్థితినిబట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజక్టుల వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్ఎండీకి, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు సోమవారం నిలిపివేశారు.



నిండు కుండలా ఎల్ఎండీ

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం 42,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 42,157 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయిదు వరద గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000 క్యూసెక్కులు, వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

● పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1,23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు సోమవారం 20 గేట్లు ఎత్తి 1,07,650 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. శనివారం రాత్రి వరకు ప్రాజెకు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో పైనుంచి వరద నీటిని అంచనా వేస్తూ శ్రీపాద ఎల్లంపల్లి గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.702 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి 15925 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 13,400, మూలవాగు, మానేరు వాగు ద్వారా 2,525 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్ల ద్వారా 10,300, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.17 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.03టీఎంసీల నీరు ఉంది.

● తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. అన్ని చోట్ల విరివిగా వర్షలు కురుస్తుండడం, వాగులు, కుంటలు, చెరువులు పొంగి పోర్లుతుండడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు తెలిసింది. మిడ్ మానేరు నుంచి వచ్చే నీరు 10 వేల క్యూసెక్కులకు తగ్గింది ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి వరకు 22.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 623 క్యూసెక్కులు, ఎంఎంఆర్ నుంచి 10,300, ఎగువ నుంచి 1,050 క్యూసెక్కులు మొత్తం 11,973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 305 క్యూసెక్కుల నీరు ఆవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వినాయక మండపాల్లో చోరీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 9: మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎండీ కాలనీలోని రెండు వినాయక మండపాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపం అవరణలోని హోమశాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హోమశాల తాళం పగలగొట్టి వినాయకుడికి భక్తులు వేసిన కరెన్సీ దండతోపాటు విగ్రహం వద్ద ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయంలోని లాకర్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. హ్యాండిల్ విరిగిపోవడంతో వెళ్లిపోయారు. శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోకి దొంగలు చొరబడి వినాయకుడికి తొడిగిన రాగి తొండంను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించినట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

'ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రవణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు ఎస్సీ సంక్షేమ ప్రభుత్వ హాస్టల్స్ మంజూరయ్యాయన్నారు. వాటిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. ప్రభుత్వం మంజూరు చేసినా ఎందుకు ప్రారంభించకుండా కాలం గడుపుతున్నారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాష్, గన్నరపు రాకేష్, అంబాల సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం ఇప్పించండి'

రామడుగు, సెప్టెంబరు 9: భారీ వర్షాలతో నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు రామడుగు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని షానగర్ ఎల్లమ్మ చెరువు కట్టకు గండిపడిందన్నారు. చెరువులోని చేపలన్నీ కొట్టుకు పోయి పది లక్షల నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు జిట్టవేణి రాజు, ఉపాధ్యక్షులు రవి, నర్సయ్య, లక్ష్మీపతి, బసరవేని రాజయ్య పాల్గొన్నారు.

తిప్పన్నపేటలో ప్రబలిన జ్వరాలు



తిప్పన్నపేట లో పరీక్షలు చేస్తున్న మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9: జగిత్యాల మండలం తిప్పన్నపేటలో జ్వరాలు ప్రబలాయి. జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జగిత్యాల జిల్లా మాత శిశుసంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు ఇళ్లను పరిశీలించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు.

హైడ్రా వల్ల సామన్యులకు ఇబ్బందులు ఉండవు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైడ్రా వల్ల సామాన్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాపై బీజేపీ నాయకులు నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు సక్రమంగానే జరుగుతుందన్నారు. ప్రతి పక్షాలకు ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను గౌరవిస్తామన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయాన్ని శాసనసభ వ్యవహారాల మంత్రి, అధికారులు చూసుకుంటారని అన్నారు.

'చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 9: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చాకలి వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు వనపర్తి శంకర్, పైడి కొమురయ్య, రాచకొండ నరేశ్, జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నేరెళ్ల లక్ష్మన్, తడిగొప్పుల శ్రీపాల్, కార్యదర్శి మునిగంటి అశ్విన్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు బెక్కంటి రమేశ్‌తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో చెరువు శిఖం భూములను, నాళాలు, పార్కులను కబ్జాదారుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు అదృశ్యం కావడానికి ప్రధాన కారకులు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులేనని విమర్శించారు. అధికారుల అండదండలతో కొంతమంది రాజకీయ నాయకులు, కబ్జాదారులు కుమ్మక్కై పెద్దఎత్తున చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్‌ఎఫ్‌సీఎల్ చెలగాటం

● అమ్మోనియా వ్యర్థాలను డ్రైనేజీలు, గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ● ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ పెడతామంటూ పీసీబీకి హామీ ● మూడేళ్లు గడుస్తున్నా ఊసే లేదు

కోల్‌సిటీ, సెప్టెంబరు 9: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి చుక్క నీరు బయటకు పోదని, వ్యర్థాల ఊసే ఉండదని, ఉత్పత్తికి వినియోగించిన నీటిని శుద్ధి చేసి ప్లాట్ టౌన్ షిప్‌లో మొక్కల పెంపకానికి వినియోగిస్తామంటూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఊదరగొట్టింది. ఏడాదిలో జీరో లిక్విడ్ డిశ్చార్జి(జెడ్‌ఎల్‌డీ)నిర్మిస్తామని కాలుష్య నియంత్రణ మండలికి హామీపత్రం ఇచ్చింది. ఉత్పత్తి ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా జెడ్‌ఎల్‌డీ ఊసే లేదు. జెడ్‌ఎల్‌డీ నిర్మించిన తరువాతే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా జెడ్‌ఎల్‌డీ నిర్మాణం లేకుండానే ప్రాజెక్టుకు కాలుష్య నియంత్రణ మండలి కాన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ ఇచ్చేసింది. గత ఏడాది రూ.328కోట్ల నికర లాభాలను ఆర్జించిన సంస్థ జెడ్‌ఎల్‌డీకి రూ.170కోట్లు పెట్టేందుకు వెనుకాడుతోంది. జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి ఫిబ్రవరిలో టెండర్లు ఆహ్వానించి తరువాత వదిలేసింది. ప్లాంట్ నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాలను నేరుగా గోదావరిలోకి వదులుతున్న సంస్థ తాజాగా లీకేజీ అయిన అమ్మోనియాను నేరుగా మున్సిపల్ డ్రైన్లలోకి వదిలింది. అమ్మోనియా ఘాటుకు వేల మంది జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మాత్రం నోరు మెదపడం లేదు.

రామగుండం ఎరువుల కర్మాగారం నిర్మాణ సమయంలో ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, తరువాతే ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రభుత్వానికి ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జనం ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే వ్యర్థాలపై ఆందోళన వెలిబుచ్చారు. ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, చుక్క నీరు కూడా బయటకు రాదని పేర్కొన్నది. సాధారణంగా చిన్నచిన్న పరిశ్రమల్లో సైతం ఉత్పత్తికి ముందే జెడ్‌ఎల్‌డీ నిర్మాణం జరుగుతుంది. కానీ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మాత్రం జెడ్‌ఎల్‌డీ నిర్మాణమే జరుపలేదు. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 2021-22ఆర్థిక సంవత్సరంలో అమ్మోనియా లీకేజీ కావడంతో జనం ఆందోళనకు దిగారు. ఒక సందర్భంలో కాలుష్య నియంత్రణ మండలి ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపి వేయించింది. కేంద్రం జోక్యం చేసుకుంది. ఆ సమయంలో ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ నిర్మిస్తామంటూ పీసీబీకి రాతపూర్వక హామీ ఇచ్చింది.



విఠల్‌నగర్ డ్రైనేజీలోఆర్‌ఎఫ్‌సీఎల్ నీరు



వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్న విఠల్‌నగర్ వాసులు (ఫైల్)

● జెడ్‌ఎల్‌డీ అంటే...

ఫెర్టిలైజర్స్ ఇండస్ట్రీస్‌లో నీటి కాలుష్యం జరుగుతుంది. ముఖ్యంగా అమ్మోనియా ఉత్పత్తి సమయంలో వ్యర్థాలు వెలువడుతాయి. జెడ్‌ఎల్‌డీ(జీరో లిక్విడ్ డిశ్చార్జి)కి సంబంధించి మూడు స్టేజీల్లో ట్రీట్‌మెంట్ జరుగుతుంది. మొదట వ్యర్థ జలాల నుంచి వ్యర్థాలను తొలగించడం, తరువాత వ్యర్థాలను ఘన రూపంలోకి, ద్రవరూపంలోకి మార్చుతారు. నీటిని పూర్తిగా శుద్ధి చేసి తిరిగి పారిశ్రామిక అవసరాలకు వినియోగించడం లేదా ప్లాంట్లలో గ్రీనరీకి వాడడం చేస్తారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కూడా వ్యర్థ జలాలను శుద్ధి చేసి చెట్ల పెంపకానికి వాడతామంటూ ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది.

● ప్రజలకు, పర్యావరణానికి ముప్పు

ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదులుతుండడంతో జిల్లాలోని అమ్మోనియా, సోడియం, ఇతర న్యూట్రియన్స్, ప్రమాదకరమైన వ్యర్థాలు అందులో ఉంటున్నాయి. దీంతో గోదావరి జలాలు, సమీప కాలనీల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం ప్లాంట్‌లో నుంచి అమ్మోనియా వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రైన్‌లో కలుపడంతో రామగుండం నగరంలోని వేలాది మంది ఇబ్బంది పడ్డారు.

● టెండర్లు పిలిచినా ముందుకు సాగని పనులు

ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థ 2022-23లో రూ.8.59కోట్లు, 2023-24లో రూ.4,941 కోట్ల టర్నోవర్‌తో 328 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. 170కోట్ల రూపాయల అంచనాలతో జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. 180రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. జూన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

జ్వరంతో ఇద్దరి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 9: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో జ్వరంతో బాధపడుతూ అవ్వ లింగమూర్తి (45) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగమూర్తి జ్వరంతో బాధ పడుతూ జగిత్యాల ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

● ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని హనుమాన్ వీధికి చెందిన గజ్జల రామ్ చరణ్(10) అనే 4వ తరగతి విద్యార్థి జ్వరంతో సోమవారం మృతి చెందాడు. రామ్‌చరణ్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయిస్తున్నారు. అయినా కూడా జ్వర తీవ్రత తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు రెండు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

పెద్దాపూర్ గురుకులంలో పూర్తిస్థాయి తరగతులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నెల రోజుల తరువాత పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించారు. సోమవారం ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను నెల రోజుల క్రితం ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి ప్రభుత్వం, సొసైటీ వారి సూచనలతో వసతులు కల్పించడమే కాకుండా కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించిన అనంతరం తరగతులను పూర్తి స్థాయిలో ప్రారంభించారు. దీంతో పాఠశాలకు సోమవారం 225 మంది వచ్చారు. మరి కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి గురుకుల పాఠశాలను పరిశీలించి సోలార్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారని, మిగతా విద్యార్థులు ఈ నెల 15 నుంచి హాజరవుతారని ఉపాధ్యాయులు తెలిపారు.



పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో తరగతులకు హాజరైన విద్యార్థులు

దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సోమవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా దళితబంధు నిధుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ మేరకు కోతుల బొమ్మలను ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చొని వినూతన రీతిలో నిరసన తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన దళితులకు రెండో విడత దళితబంధు నిధులు మంజూరు చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, ఆకాష్, బిక్షపతి, రక్షిత్, రాకేష్, సరిత, అర్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబరు9: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ అపహరించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన మాసం దిలీప్‌ను విచారించగా నేరం ఒప్పుకోవడంతో కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సోమవారం విద్యుదాఘాతంతో విద్యార్థిని గాయపడింది. కేసీఆర్‌నగర్‌కు చెందిన కోలిపాక రాము-రూప దంపతుల కుతూరు లాస్య (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. ఎప్పటిలాగే సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా విద్యుత్ మీటర్లకు అమర్చిన ప్యానల్ బోర్డుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికురాలు లాస్యను కాపాడే ప్రయత్నం చేసింది. విద్యుత్ ప్రసారం కావడంతో వదిలేసింది. వెంటనే ఇంట్లో ఉన్న విద్యార్థిని తల్లి రూప కాపాడే ప్రయత్నం చేయగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. స్థానికులు కర్రసాయంతో ప్యానల్ బోర్డుకు ఉన్న లాస్య చేతిని తొలగించారు. స్పృహ కోల్పోయిన లాస్యను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతోంది.

వేములవాడ నుంచి శృంగేరీకి ప్రత్యేక బృందం

సిరిసిల్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ పనులలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం శృంగేరీ పీఠం జగద్గురు భారతీ తీర్థ, పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామిని కలవడానికి వేములవాడ నుంచి ప్రత్యేక బృందం వెళ్లింది. ఆలయ విస్తరణ నమూనాలను బృందం సభ్యులు అందించారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టేందుకు అనుమతులు కోరారు. నమూనాలను పరిశీలించిన స్వాములు ఆలయ విస్తరణకు ముందుకెళ్లాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించి సూచనలు చేస్తామని తెలిపారు. అనంతరం శృంగేరి పీఠంలోని శారదాంబ అమ్మవారిని ప్రభుత్వ విప్, అధికారుల బృందం సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించింది. శృంగేరి తరలివెళ్లిన వారిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయ స్థపతి వల్లీనాయకం, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ, రాజన్న ఆలయ ఈఈ రాజేష్, ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్ శర్మ, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేష్, ఇంజనీర్ అసిస్టెంట్ అంజయ్య ఉన్నారు.



ఆలయ అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న విధుశేఖర భారతిస్వామి

వానాకాలం తిప్పలే!

● ప్రతియేటా పాపయ్యపల్లెకు తప్పని ఇబ్బందులు

శంకరపట్నం, సెప్టెంబరు 9: ప్రతియేటా వర్షాకాలం ఆ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడితే గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా కోరుతున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో సోమవారం శంకరపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామస్థలు వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలిపారు. పాపయ్యపల్లె, కేశవపట్నం గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వర్షాలతో వరద ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు పడితే వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం అవసరాల కోసం కేశవపట్నం వెళ్తామన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.



లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న పాపయ్యపల్లె గ్రామస్థులు

మధ్యాహ్న భోజనం సరిగా లేదని విద్యార్థుల ఆందోళన

ధర్మపురి, సెప్టెంబరు 9: మండలంలోని ఆరెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని పిల్లలు ఆందోళన చేసి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. వంటలో పురుగులు, వెంట్రుకలు ఉన్నా అలానే వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వంట మనుషులు తమకు వద్దంటూ విద్యార్థులు తెలిపారు. వారిద్దరూ పాఠశాలలో ఉంటే తాము పాఠశాలలోకి వచ్చేది లేదంటూ విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్న వ్యక్తి ఆలకుంట పాపయ్య తీవ్ర గాయాలపాలయ్యాడని పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాపయ్య సైకిల్‌పై ఎల్లారెడ్డిపేట బస్టాండు ప్రాంతం నుంచి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వైపునకు వెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వెళుతున్న కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

అడవిలో చెట్ల నరికివేత

● 8 మందిపై కేసు నమోదు

వీర్నపల్లి, సెప్టెంబర్ 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలోని కొచ్చ గుట్ట బోరు, అందుగు చెట్టు బయిలు, కొమటి కుంట్ల ప్రాంతాల్లోని అడవిలో కొన్ని రోజులుగా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పోడు భూములు సాగు చేసేందుకు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అటవీ చెట్లను కొందరు దుండగులు నరికేశారు. ఓ వైపు ప్రభుత్వం హరితహారంలో చెట్లు నాటాలని చెబుతుంటే కొందరు అక్రమార్కులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత లాభం కోసం అటవీ సంపదను ధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గర్జనపల్లి సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో సిబ్బంది పోడు భూముల సాగుకు ఎకరానికి సుమారు లక్షకు పైగా ముడుపులు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పోడుభూమి సాగుకు తమ చెప్పిన ట్రాక్టర్‌నే వాడాలని చెప్పడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు.





అటవీభూమిలో నరికివేసిన చెట్లు

వన్‌పల్లిలో చెట్ల నరికివేత విషయంపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆయూబ్ ఖాన్ ను ఫోన్ ద్వారా వివరణ కోరగా అటవీ చెట్లను నరికిన విషయం తమ దృష్టికి వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేసి 8 మంది పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 49క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.7,650 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

వృథాగా దామెర చెరువు నీరు



దామెర చెరువు తూము నుంచి పోతున్న నీరు

శంకరపట్నం, సెప్టెం బరు 9: శంకరపట్నం మండలం మొలంగూర్ దామెర చెరువు తూము తెరిచి ఉండడంతో చెరువులో నీరు దిగువ కు వృథాగా పోతోంది. చెరువు తూము తెరిచి ఉంచడంతో నీరు దిగు వకు వెళ్లిపోయి వేసవిలో అవసరాలకు నీరు లేకుండా పోతుందని ఆవేదన చెందారు. నీరు దిగువకు పోవడంతో కింద ఉన్న పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతుందన్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి తూము ద్వారా నీరు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్తిలో వాటా కోసం అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

● పోలీసులు, పెద్దల జోక్యంతో కార్యక్రమాలు పూర్తి

మంథని, సెప్టెంబర్ 9: భర్త ఆస్తిలో తన కొడుకుకు వాటా కోసం భర్త అంత్యక్రియలను భార్య అడ్డుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని గోదావరినది తీరంలో సోమవారం జరిగింది. మంథని మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన సురేష్‌కు సంధ్యతో మూడు సంత్సరాల క్రితం వివాహం కాగా వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ కలహాల కారణంగా సంధ్య కొంత కాలంగా సురేష్‌కు దూరంగా ఉంటోంది. ఈక్రమంలో సురేష్(30) హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మంథని గోదావరి నది తీరానికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన భార్య సంధ్య తన కొడుకుతో పాటు మంథని గోదావరినది తీరానికి చేరుకొని భర్త ఆస్తిలో తన కొడుకు వాటా తేల్చాకే అంత్యక్రియలు జరపాలని అడ్డుకున్నారు. భర్త తరుపున కుటుంబ సభ్యులు నచ్చజెప్పినప్పటికీ వినలేదు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు కర్మకాండలు ముగిశాక ఆస్తి గుర్చించి చర్చిద్దామని నచ్చజెప్పడటంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

108లో మహిళ ప్రసవం

● తల్లి, బిడ్డను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన సిబ్బంది



108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన కలవేన శారద పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. హుటాహుటిన 108 సిబ్బంది శారద ఇంటికి చేరుకుని వెంటనే పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించే క్రమంలో మహిళకు పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ పైలట్ హబీబ్ సహకారంతో కాల్ సెంటర్ ద్వారా వైద్యుల సలహా మేరకు 108 వాహనంలోనే ప్రసవం చేశారు. కలవేని శారద పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లి, బిడ్డను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు

గొల్లపల్లి, సెప్టెంబరు 9: గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామానికి సమీపంలో బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మిస్తే తమ పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా అనారోగ్యం పాలవుతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వెంగళాపూర్ గ్రామానికి చెందిన రైతులు, నాయకులు, యువకులు మండల కేంద్రానికి తరలివచ్చి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు అంటూ తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రైస్ మిల్లు ఏర్పాతో గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యం పాలవుతామని అన్నారు. కార్యక్రమంలో ఇను గంటి గంగన్న, రేగుంట అంజయ్య, వనపర్తి పెద్దిరాజం, దాసరి నాగేశ్, డెక్క రాజనర్సు, కొంద్ర గంగారెడ్డి, వనపర్తి రాజేందర్ పాల్గొన్నారు.

ఆయన అవయవాలు సజీవం

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

● అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులు



నాగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: తనువు చాలించినా అవయవ దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు (43) ఎంఏ, ఎంఎడ్ పూర్తి చేసి స్థానికంగా వ్యవసాయం చేస్తూ పాడి గేదెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 5న ఎల్లారెడ్డిపేట శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయలవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు నాగరాజు చికిత్స పొందాడు. ఆదివారం రాత్రి పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. కుటుంబ పెద్ద దూరమైనా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించిన కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. జీవన్‌దాన్ సంస్థ ద్వారా కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం సేకరించారు. అక్కడి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నాగరాజు పార్థివదేహం వద్ద గౌరవ వందనం చేశారు. అనంతరం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. నాగరాజు బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగేవాడు. గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక నాయకులు నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాడే మోశారు. మృతుడికి తల్లి అనసూయ, భార్య వసుధ, రెండేళ్ల వయసు ఉన్న కొడుకు శిశ్వ ఉన్నారు. తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన మండలంలోని కోరుట్లపేటలోని ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షురాలు సంధ్య

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 9: దివ్యాంగుల హక్కుల చట్టం - 2016ను ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ చట్టాన్ని అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం గౌర వ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్, ప్రధాన కార్యదర్శి భోగ రాజయ్య, సహాయ కార్యదర్శి అంబటి శ్రీనివాస్, కోశాధికారి ఉరగొండ లత, నాయకులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 9 : వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతి రావు రాజన్న ప్రసాదం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్ ఉన్నారు.

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సోమవారం దర్శించుకున్నారు. రాజన్న దర్శనానికి వచ్చిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయాధికారులు రాజన్న ప్రసాదం అందజేశారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: వినాయక ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో వినాయక మండప నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, సెస్ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత సామరస్యాన్ని పాటించి వేడుకలను వైభవంగా జరుపుకోవాలని అన్నారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, ఎంపీడీవో సత్తయ్య, సెస్ ఏఈ పృథ్వీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముస్తాబాద్, సెప్టెంబరు 9 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సీఐ మల్లేశ్ అన్నారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సీఐ మల్లేశ్ వరంగల్ జిల్లాలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. సొంత గ్రామానికి వచ్చిన సందర్భంలో ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన మట్టి వినాయక పూజల్లో పాల్గొని యువతను అభినందించారు.

ఘనంగా భగవాన్ బలరాం జయంతి



బలరాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న లక్ష్మీపతి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 9: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో భగవాన్ బలరాం జయంతి నిర్వహించారు. భగవాన్ బలరాం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చెరువు కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 9: సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్త చెరువుతోపాటు నాళాల కబ్జాపై కలెక్టర్‌కు పిర్యాదు చేశామని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం తెలిపారు. సోమవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ(ఎంఎల్)కార్యాలయంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల కొత్త చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరిగాయని, కొందరు నాళాలను కబ్జా చేసి పెద్ద పెద్ద భవనాలను నిర్మించుకున్నారని ఆరోపించారు. నాళాలపై భవన నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి వర్షానికే సిరిసిల్ల పాతబస్టాండ్, ఆసిఫ్‌పుర, శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలు వరద ప్రభావానికి గురవుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు బొద్దుల శ్రీహరి, గుజ్జె దేవదాస్, రాజేశం, ఎల్లయ్య, బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో విద్యార్థుల కష్టాలు

- సోషల్ మీడియాలో వైరలైన వీడియో

వీర్నపల్లి, సెప్టెంబరు 9: పాఠశాల సమయానికి రద్దీతో ఆర్టీసీ బస్సులో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటూ విద్యార్థులు ముఖ్యమంత్రికి విన్నవించిన వీడియో సోమవారం మండలంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాఠశాల సమయానికి నడిచే వన్‌పల్లి-ఎల్లారెడ్డిపేట ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో నిండిపోతోందని, ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డోర్ వద్ద విద్యార్థులు ప్రమాదకరంగా వేలాడుతూ కనిపించారు. మారుమూల ప్రాంత అటవీ పల్లెల్లో చదివే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని కోరారు.

తాగునీటికి ప్రత్యేక చర్యలు

వీర్నపల్లి, సెప్టెంబరు 9 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు ఎంపీ నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు బీజేవైఎం మండల అధ్యక్షుడు బండారు మహేష్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చెస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు మాలోతు లక్పతి, బట్టు పీర్యా, బానోతు శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి స్థలం కేటాయించాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం ఆవరణలో గంగమ్మ ఆలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక గంగపుత్ర సంఘం సభ్యులు సోమవారం తహసీల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఏటా నిర్వహించే గంగమ్మ వేడుకలకు ఆలయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, సంఘం సభ్యులు పద్మయ్య, దేవదాస్, మైసయ్య, ఎల్లయ్య, దేవయ్య, రాకేశ్ ఉన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన

వీర్నపల్లి, సెప్టెంబరు 9: వీర్నపల్లి మండల ప్రధాన రహదారి వర్షానికి అధ్వానంగా మారిందని, ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక యువకులు మండిపడ్డారు. సోమవారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. మారుమూల ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. ప్రతిరోజు వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కనీసం రోడ్డు వెంట నడవలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

హత్యాచార నిందితులను అరెస్టు చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9:కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగి నెలరోజులు గడిచినా అసలు నిందితులను అరెస్టు చేయలేదని జాతీయ స్త్రీల వ్యాధు ల నిపుణుల సంఘం(ఫాగ్సీ) బాధ్యులు సోమవారం గీతా భవన్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ రేఖరాణి, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ చంద్ర మతి, డాక్టర్ హరికిషన్, డాక్టర్ తాత్విక పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి



వేములవాడలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 9: ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు తెలంగాణ రాష్ట్రం కోసం కాళోజీ పోరాటాలు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కాళోజీ నారాయణరావు పేరు పెట్టారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మార్కెఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య మాజీ ఎంపీపీ చంద్రయ్య, నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: బడి పలుకుల భాష కాకుండా పలుకు బడుల భాష కావాలని, మన యాజను ప్రజల భాషగా తీసుకొచ్చిన వ్యక్తి కాళోజి నారాయణరావు అని ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ రజాకారులను ఎదురించి జైలు పాలైన భయపడ కుండా తెలంగాణ ఉద్యమంలో దిక్కార స్వరాన్ని వినిపించారన్నారు. కవులు, రచయితలు జనపాల శంకరయ్య, బూర దేవానందం, వెంగళ లక్ష్మణ్, చిటికెన కిరణ్‌కుమార్, అంకారపు రవి, గుండెల్లీ వంశీ, కోడం నారాయణ పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని బీసీ స్టడీసీ సర్కిల్‌లో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జల్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలిక జిల్లా పరిషత్ పాఠశాలలో కాళోజీ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని శారద తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలపరిషత్ కార్యాయంం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో శశికళ, ప్రిన్సిపాల్ దేవరాజం పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో లక్ష్మీనారయణ, సూపరింటెండెంట్ రమేశ్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ రెహనా ఇఫ్తత్, వైస్ ప్రిన్సిపాల్ అనూష పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని, తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంతోపాటు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాకవి కాళోజీ జయంతిరా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రఘురాం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాఠశాలలో క్విజ్ పోటీలు, బాలకవి సమ్మేళనం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ: ప్రజల బాధలు, సమస్యలను కవిత్వం ద్వారా గొంతెత్తిన గొప్ప కవి కాళోజీ నారాయణరావు అని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి కొనియాడారు. ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని వేములవాడ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాళోజీ గొప్ప ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారుడు అని, ప్రజల ఆవేదనను గేయాలు, కవితల రూపాల్లో తెలియజేశారని అన్నారు. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా గళం ఎత్తారన్నారు. ప్రజాకవి కాళోజీ జయంతిని గత ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి ఆయనను గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్ జోగిని శంకర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

● వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శరత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. తహసీల్దార్ విజయప్రకాశరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేదారేశ్వర్ పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మండల పరిషత్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాడుగుల కృష్ణాకర్, రమేష్ బాబు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులు అర్పిస్తున్న కవులు, రచయితలు



బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులు పిల్లలకు మార్గదర్శకులు



శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 9 : ఉపాధ్యాయులు పిల్లలకు మార్గదర్శకులని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్యబాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్ గౌడ్ ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్‌లతో కలిసి సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సహజంగా పిల్లలను తల్లిదండ్రులు నాలుగు సంవత్సరాలు వరకు కంటికి రెప్పలా కాపాడుకొని భవిష్యత్‌పై ఆశలతో జ్ఞానాన్ని అందించాలని ఉపాధ్యాయుల వద్దకు పంపిస్తారన్నారు. పిల్లలు ప్రయోజకుల అయ్యే వరకు వారికి ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పాకాల శకర్‌గౌడ్ సేవలను కొనియాడారు. ఎంఈవో దూస రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాకవత్ మోతీ లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిపేటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9:వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట మండలంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, పదిర, తిమ్మాపూర్, నారాయణపూర్ గ్రామాల్లోని యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పవర్ యువజన సంఘం మండపం వద్ద కుంకుమ పూజలు చేశారు.. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆదిదేవుడికి పూజలు నిర్వహించారు. అనంతరం యువజన సంఘాల వారు అన్నదానం చేశారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో గణేష్ మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. వేములవాడ పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ గణేష్ మండపం దగ్గర అన్నదానం ఏర్పాటు చేయగా వేములవాడ అసెంబ్లీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ప్రారంభించారు. పట్టణంలోని గాంధీ నగర్ చెందిన అంజనేయ యూత్ ఆధ్వర్యంలో గణనాథునికి కుంకుమ పూజలు నిర్వహించారు

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంతోపాటు కిష్టంపేట, సనుగుల గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు మ్యాకల గణేష్, పులి సత్తయ్య, శ్రీనివాస్, దేవరాజు పాల్గొన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- సమస్యలకు పరిష్కారం చూపాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి సమస్యలు వెల్లువెత్తాయి. సమస్యలను విన్నవించేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సదర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో 97 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాలన్నారు. అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు పేర్లు నమోదయ్యాయి

బోయినపల్లిమండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మిడ్‌మానేరు ముంపు నిర్వాసితులకు ఇచ్చిన ఇళ్ల ప్లాట్‌లకు ఆన్‌లైన్‌లో తప్పుడు పేర్లు నమోదయ్యాయని, వాటిని సరిచేయాలని నిర్వాసితులు కలెక్టర్‌కు విన్నవించారు.

గ్రామంలో లేనివారిపేర్లు ఓటర్‌లిస్ట్‌లో..

వేములవాడ అర్బన్ పరిధిలోని చింతల్‌ఠాణ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నివాసం లేని వారి పేర్లు ఓటర్‌లిస్ట్‌లో ఉన్నాయని దీనిపై విచారణ జరిపించి ఆ పేర్లను తొలగించాలని గ్రామానికి చెందిన చొక్కాల రాము, శేర్ల రాయమల్లు, చొక్కాల ప్రసాద్, శ్రీనివాస్, కోరం మల్లయ్య, మల్లేశం సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు.

గొర్రెల పంపిణీలో అవకతవకలు

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట యాదవ కులస్థులకు గత ప్రభుత్వం అందించిన గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగాయని దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చంద్రంపేటకు చెందిన యాదవ కులస్థులు బీనవేణి మల్లేశం యాదవ్, శ్రీకాంత్‌యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీపై సమగ్రంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

రుద్రంగి, సెప్టెంబరు9: జ్వరాలు విజృంభించడంతో రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం పలు కాలనీల్లో వైద్యశిబిరం కొనసాగించారు. ఓడ్డెర కాలనిలో, కిష్టరావుపల్లెలో 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న, ఏఎన్ఎంలు విజయ, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 9: రుద్రంగి మండల కేంద్రం శివారులో సోమవారం కారు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి రుద్రంగి వైపు కారు వస్తుండగా రుద్రంగి నుంచి వేములవాడకు వెళ్తున్న ఆటో సబ్ స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలో ఉన్న తండ్రీకొడుకులు విజయ్, రుషికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, సెప్టెంబరు 9: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎనుగు మనోహర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో అన్నవేని స్వామి, గడ్డం రాజం, ఎర్రం లక్ష్మి, నోముల రవి, చలిగంటి లక్ష్మి, శారద, బక్కన్న, మృతి చెందారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం తదితరులు ఉన్నారు.

చలో కరీంనగర్ కరపత్రం ఆవిష్కరణ

భీమారం, సెప్టెంబరు 9: ఎస్సీ వర్గీకరణ సాధించ డంతో అమరులను తలుచుకుంటూ కరీంనగర్‌లోని ఇందిరా గార్డెన్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ఉ మ్మడి కరీంనగర్ జిల్లా మాదిగల ఐక్య వేదిక సదస్సు కరపత్రాన్ని టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బంగారు దీపక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భీమారం, మేడి ప ల్లి మండలాల నాయకులు అధిక సంఖ్యలో తరలి వ చ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబరు 9:ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెర్లుమద్ది ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. మండలంలోని నామాపూర్‌కు చెందిన కరమంచి గట్టయ్య రేషన్ షాపు నుంచి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడ

పెగడపల్లి, సెప్టెంబరు 9 : మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠ శాలల్లో సోమవారం స్వచ్ఛ త పక్వాడ నిర్వహించారు. పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన క ల్పించేందుకు గాను చేతులు శుభ్రంగా ఎలా చేసుకో వాలో వివరించి విద్యార్థినీ విద్యార్థుల చేతచేయించారు.

కథలాపూర్ : చేతులను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచే రవని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కె. మహేశ్ సూచించారు. మండలంలోని సి రికొండ పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

పోడు భూములకు పట్టాలు ఇప్పించాలి

కథలాపూర్, సెప్టెంబరు 9 : ఎన్నో ఏళ్ళుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మండలంలోని పలు గ్రామాల గిరిజన తండావాసులు మంగళవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు గత ప్రభుత్వం తమకు పట్టాలు ఇస్తామని చెప్పి 400 ఎకరాలకుగాను కేవలం ఎకరం మాత్రమే పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నందు వల్ల పట్టా ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సర్వేలు నిర్వహించి అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని 9 గిరిజన తండాలకు చెందిన గిరిజనులు కోరారు

బ్యాక్‌వాటర్ రాకుండా చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 : సిరిసిల్ల పట్టణ శివారులోని మిడ్‌మానేరు కరకట్ట కింద ఉన్న పంట పొలాల్లోకి బ్యాక్‌వాటర్ రావడంతో పంటలన్నీ నీటిలో మునిగిపోతున్నాయని, నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి సమస్యను విన్నవించి వినతి పత్రాన్ని అందించారు. తుంగపాట పోచ్చమ్మ రైతు పరస్పర సహాయక సహకార పరపతి సంఘం శాంతినగర్ సిరిసిల్ల ఆధ్వర్యంలో తరలి వచ్చారు. రైతులు మాట్లాడుతూ నీటితో పంటలు నష్టపోతున్నామన్నారు. పట్టణంలోని నిరుపేద రైతులమైన తాము మానేరు వాగు ఒడ్డున ఉన్న వ్యవసాయ భూముల్లో పంటలను సాగు చేసుకుంటున్నామని, మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ పట్టణంలోకి రాకుండా అధికారులు కరకట్టను నిర్మించడంతో వచ్చిన బ్యాక్ వాటర్ మొత్తం పొలాల్లోకి చేరుతోదన్నారు. అప్పులు చేసి సాగుచేసుకున్న పంటలు నీటిలో మునిగిపోతుండడంతో నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా బ్యాక్ వాటర్ వచ్చిన ప్రతిసారీ ఇదే సమస్య వస్తోందని, దీనిపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందని అన్నారు. కలెక్టర్ స్పందించి బ్యాక్ వాటర్ పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షుడు అన్నారపు కనుకయ్య, ఉపాధ్యక్షులు కొలుగూరి భూలక్ష్మీ, కార్యదర్శి అన్నారపు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పాటి కిరణ్‌కుమార్, కొలుగూరి లచ్చయ్య, సిరిగిరి బాలయ్య, పాటి కుమార్ రాజు, పాటి రవితేజా పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన లబ్ధిదారులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 : భూమి కొనుగోలు పథకం కింద మాకు అందించిన భూములకు పట్టాలను అందించాలంటూ బద్దెనపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఉన్నఎస్సీ కులస్థులకు 1994 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం కింద భూమిని కొనుగోలు చేసి భూములు లేని 73 మంది లబ్ధిదారులకుఅందించడం జరిగింద ని తెలిపారు. అప్పటి నుంచి అ భూములలో మనికి 10 గుంటలు, 15 గుంటల చొప్పన హద్దులను పెట్టుకుని సాగు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అయితే 73 మందికి ఇచ్చిన అ భూములకు సంబంధించిన పట్టాలను 40 మందికే ఇవ్వడం జరిగిందని మిగిలిన 33 మందికి పట్టాలు లేకపోవడంతో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి మిగిలిన 33 మందికి పట్టాలను అందించి అదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సిలివేరి శాంతవ్వ, మాజీ సర్పంచ్ పోచయ్య, బాలవ్వ, కోలాపూరి బాలవ్వ, మంజుల, ఎల్లవ్వ, లక్ష్మీ, పుష్పలత, గడ్డం ఎల్లవ్వ, కోలాపూరి పద్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 9 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఏఐటీ యూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన రోజు వంటలు చేయడానికి ఎవరూ లేదని, సొంత డబ్బులతో వంట పాత్రలు, గ్యాసు, సరుకులు కొనుగోలు చేసి నిర్వహిస్తున్నామని తెలిపారు. బిల్లులు వచ్చినప్పుడే తీసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నడిగొట్టు లక్ష్మీ పాల్గొన్నారు.

కోనరావుపేట : మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో రఘుపతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 30 వరకు సమస్యలను పరిష్కరించకపోతే పిల్లలకు కోడిగుడ్లు అందించబోమన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.